ప్రజాశక్తి
శుక్రవారం 01 ఆగస్టు 2025
5
కర్నూలు





విద్యార్థులతో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

మారని టిడ్కో..!

- మౌలిక వసతులు కరువు
- నివాసానికి అనానుకూల వాతావరణం
- ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై ఒత్తిడి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...



పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి గతంలో అప్పటి మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్లు పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి.

నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్‌ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే లబ్ధిదారులు ఇళ్లలో చేరాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. మౌలిక వసతులు లేని ప్రాంతాల్లో ఎలా నివాసం ఉండగలమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండల కేంద్రంలోని ఎపిమోడల్ స్కూల్ కస్తూరిబా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లులోని పలు ప్రభుత్వ పాఠశాలలను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలన చేసింది. మండల కార్యదర్శి బి నాగన్న, పార్టీ మండల కమిటీ సభ్యులు టిమల్లేష్‌లతో కలిసి స్కూలు ప్రధానోపాధ్యాయులను , మధ్యాహ్న భోజనం ఉండే కార్మికులను , విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఎపి మోడల్ స్కూల్ ,కస్తూరిబా స్కూల్లో విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి వీలుగా లేదన్నారు. హైవే నుండి స్కూళ్లకు వెళ్లేందుకు ప్రధాన రోడ్డు లేదని, దీనివల్ల వర్షం పడితే బురదమయమై విద్యార్థులు స్కూలుకు వెళ్లడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యాశాఖ స్పందించి స్కూళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పిల్లల తల్లిదండ్రులను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కెఎంసి గ్రౌండ్‌ను కాపాడుకుందాం

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీ మైదానాన్ని కాపాడుకుంటామని ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మెడికల్ కాలేజీ ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్ మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కాలేజీకి గొప్ప చరిత్ర ఉందన్నారు. మెడికల్ కాలేజీలో 2500 మంది వైద్య విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారికి మానసిక ఒత్తిడి దూరం చేయడానికి మైదానం ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే మెడికల్ కాలేజీ మైదానం 8 ఎకరాల నుంచి 5 ఎకరాలకు తగ్గుతూ వచ్చిందన్నారు. నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని పూర్వ విద్యార్థులు ఒక మంచి కార్యక్రమాన్ని ముందుకు తీసుకొని వచ్చారు. మెడికల్ కాలేజీ మైదానం కాకుండా ఇతర ప్రభుత్వ భూముల్లో నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఎస్ఎఫ్ఐ కూడా అభినందిస్తుందన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ అనుమతి , విద్యార్థుల అభిప్రాయాలు తీసుకొని ఏర్పాటు చేయడం ద్వారా మెడికల్ విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే మైదానాన్ని దగ్గించడాన్ని ఎస్ఎఫ్ఐగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అంజి, సహాయ కార్యదర్శి అబుబకార్, ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర నాయకులు పృధ్వి, యోగి, మహేష్, రంగనాథ్, హరి, మురళి, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

7న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల చలో విజయవాడ

- విద్యుత్ ఎస్ఇకి వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7న జరగు చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు కోరారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, నాగరాజు, విద్యుత్తు స్టోర్ హమాలీస్ యూనియన్ నాయకులు చలపతి, వెంకటేష్‌లతో కలిసి విద్యుత్ ఎస్ఇ ఉమాపతికి అందజేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మూడు శతాబ్దాలుగా పనిచేస్తున్నప్పటికీ వారిని పర్మినెంట్ చేసే పూసే ఎత్తడం లేదని విమర్శించారు. జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో సంస్థనే నమ్ముకొని ఎంతో ఆశతో పని చేస్తున్నారని అన్నారు. షిఫ్ట్ ఆపరేటర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, బిల్ కలెక్టర్లుగా, స్టోర్ హమాలిస్‌గా, మీటర్ రీడర్స్‌గా, పోల్ టు పోల్ కార్మికులుగా కష్టపడి పని చేస్తూ విద్యుత్తు సంస్థకు ఆదాయం పెంచుతున్నా వారికి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అందడం లేదని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సి ఏరియర్స్‌తో సహా బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీస వేతనం రూ.46 వేల బేసిగ్గా నిర్ణయించాలని కోరారు. నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు వాచ్మెన్‌గా పనిచేస్తూ షిఫ్ట్ ఆపరేటర్లుగా ప్రమోట్ అయిన వారికి పాత ఆపరేటర్స్‌తో సమానంగా రూ.27,900 వేతనం ఇవ్వాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ అన్ స్కిల్డ్ కార్మికులకు ఐటిఐ విద్యార్హతలవారిని స్కిల్డ్‌గా ప్రమోట్ చేసి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనం ఇవ్వాలని కోరారు. బిల్ కలెక్షన్ ఏజెంట్లకు, ఎస్‌పిఎం కార్మికులకు, విద్యుత్తు స్టోర్ హలీస్‌కు పీస్ రేటు విధానం రద్దుచేసి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7న విజయవాడ విద్యుత్ సౌదా దగ్గర ఆందోళనలో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పి4లో భాగస్వామ్యం కావాలి

- కలెక్టర్ రంజిత్ బాషా విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పి4 విధానంలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పి4 విధానంపై పరిశ్రమల యాజమాన్యాలు, ఇండస్ట్రియల్ అసోసియేషన్ల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదల అవసరాలను బట్టి సహాయం అందించవచ్చని, కుటుంబాలను దత్తత తీసుకోవచ్చన్నారు. సిఎస్ఆర్ కింద వెసులుబాటును చేసుకొని ఒక గ్రామాన్ని కూడా దత్తత తీసుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందించవచ్చని వివరించారు. పేదలను ఆదుకునేందుకు ఆయా పరిశ్రమలు యజమానులు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.జైరాజ్ ఇస్పాత్, టీజీవి ఇండస్ట్రీస్, రాయలసీమ ఆల్కలీస్, రాజ్ ఇండస్ట్రీస్, కెప్టెన్ పాలీప్లాస్ట్, సీగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్, దామోదర్ ఆయిల్స్, యూనివర్సల్ హోమ్ ప్రొడక్ట్స్, ప్రీమాపాలిస్టర్ తదితర పరిశ్రమల ప్రతినిధులు తమ సమ్మతిని తెలిపాలన్నారు. సమావేశంలో సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, ఎడి భారతి, పరిశ్రమల శాఖ జిఎం జవహర్ బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ కిషోర్ కుమార్ రెడ్డి, ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి శిశువుకు ఆధార్ నమోదు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

పుట్టిన ప్రతి శిశువుకు ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసూతి ఆస్పత్రులలో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి, పుట్టిన శిశువుల ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయాలని అధికారులను ఆదేశించారు. 5 నుండి 15 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయాలని తెలిపారు. విదేశీయులు, ఎన్‌ఆర్‌ఐల ఆధార్ నమోదు విషయంలో క్షేత్ర స్థాయిలో కచ్చితంగా తనిఖీలు జరపాలన్నారు.. కోసిగి, కర్నూలు అర్బన్ మండలాల్లో నకిలీ జనన సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.. సమావేశంలో ఆధార్ టీమ్ మేనేజర్ ఎస్‌ఎం. జావీద్, జిల్లా పరిషత్ సిఇఒ జి.నాసర రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జిఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి, అడిషనల్ డిఎంహెచ్ఒ భాస్కర్, డిఇఒ శామ్యూల్‌పాల్, ఎల్ డి ఎం రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ

'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ'గా పేరు తెద్దాం

-నిర్మాణపు వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి
-ప్రతి సచివాలయ పరిధిలో పర్యవేక్షక బృందం
-డ్రైనేజీ కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లను తొలగించాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగరంలో వ్యర్థాల నిర్వహణకు తీసుకొచ్చిన నూతన విధానాన్ని పకడ్బందీగా అమలు చేసి, కర్నూలుకు 'క్లీన్‌అండ్‌గ్రీన్' సిటీగా పేరు తీసుకొద్దామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను పిలుపునిచ్చారు. గురువారం నగరపాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళిక, పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుండి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం తీసుకొస్తున్నామని, దీనిని అధికారులు, సిబ్బంది సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి, ట్రాక్టర్‌కి రూ.500, టిప్పర్‌కి రూ.1,000 చొప్పున యజమానులు రవాణ చార్జీలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటి కోసం ప్రత్యేక నెంబర్ ఏర్పాటు చేస్తామని, ఈ విధానం గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో ముగ్గురు కార్యదర్శులు బృందంగా ఏర్పడి, క్షేత్రస్థాయిలో సి అండ్‌డి వేస్టేజ్ నిర్వహణను పర్యవేక్షించాలని ఆదేశించారు. త్వరలో వార్డులకు నోడల్ అధికారులను నియమిస్తామని, వారి ద్వారా వార్డుల్లో అన్ని పనులను పర్యవేక్షించేలా చర్యలను తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా డ్రైనేజీ కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లను తొలగించాలని ఆదేశించారు. నగర ప్రజలు ఈ విధానానికి సహకరించాలని, క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జీ ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిని పరామర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్




కర్నూలు మండలంలోని పసుపల మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఇందిరా గురువారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యారు. కర్నూలులో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు ఇందిరాను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులను డిఇఒ కోరారు. ఉపాధ్యాయురాలకు మెరుగైన వైద్యం అందించేందుకు మెడికల్ ఆసుపత్రికి తరలించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు కూడా పరామర్శించారు.

సాగుకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం

టిడిపి జిల్లా అధ్యక్షులు తికారెడ్డి, పత్తికొండ, గుంతకల్ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-మద్దికేర

సాగునీటితో రాయలసీమ రైతుల దశ మార్చాలన్నదే మా సిద్ధాంత మని సీమ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తామని టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పత్తికొండ, గుంతకల్ ఎమ్మెల్యేలు కెఇ.శ్యామ్‌కుమార్ గుమ్మనూరు జయరాం అన్నారు. కర్నూలు జిల్లా మద్దికేర మండలం ఎడవల్లి గ్రామం వద్ద హంద్రీనీవా నుండి రైతుల కోసం కాలువ విస్తీర్ణ పనుల్లో భాగంగా తూము ఏర్పాటు చేశారు. హంద్రీనీవా కాలువ తూమును ప్రారంభించి జలహారతి ఇచ్చారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కా రెడ్డి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రాయలసీమ రైతుల దశ మార్చాలనేదే మా సిద్ధాంతం అని, ఇందులో భాగంగానే ఆనాడు ఎన్టీఆర్ హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టును తలపెట్టారని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి కరువు నేలకు నీరిచ్చామని, గత ప్రభుత్వ హయాంలో 5 ఏళ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ పట్టాలెక్కాయని చెప్పారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను మూడు నెలల లోపు పూర్తి చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఈ ప్రాజెక్టును నిర్దేశిత కాలానికి ఎట్టిపరిస్థితుల్లో పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారన్నారు. ఇక కర్నూలు, అనంతపురం జిల్లాల్లోనీ పత్తికొండ, గుంతకల్ నియోజకవర్గ పరిధిలోని రైతులకు ఇక్కడ తూము ఏర్పాటు చేయడంతో దాదాపు 50 వేల ఎకరాల వరకు సాగునీరు, గుంతకల్ నియోజకవర్గంలోని వైటి చెరువు, పాత కొత్తచెరువు, గుత్తి చెరువుకు నీరు చేరుతుందన్నారు. సీమలో కీలకమైన హంద్రీనీవా ప్రాజెక్టుతో పాటు వేదావతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామని ఉన్నారు. రైతులకు సాగునీరు, డ్రిప్ సబ్సిడీలు ఇచ్చి రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మార్చిన ఘనత సిఎందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ జెడ్పిటిసి రాజన్న యాదవ్, న్యాసర రామాంజనేయులు, చంద్రశేఖర్ గౌడ్, ఆకుల వేణుగోపాల్, గడ్డం రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, పారా రాఘవేంద్ర, బందెల ఆనంద్ కుమార్, మహిళా నాయకురాలు గూడూరు కవిత, ఐ టిడిపి మండల కన్వీనర్ హుస్సేన్ పీరా పాల్గొన్నారు.



తూమును ప్రారంభిస్తున్న తిక్కారెడ్డి, గుమ్మనూరుజయరాం, శ్యాంకుమార్

విద్యుత్ చార్జీల దోపిడీని ఆపాలి

-ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి -5న నిర్వహించే జయప్రదం చేయండి

-ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు ప్రజా సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం గురువారం కొత్త బస్టాండ్ కార్మికకర్షక భవన్ నందు సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు ఆర్ నరసింహులు సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. విజయ్ అధ్యక్షత నిర్వహించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ ,రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్.సాయిబాబాలు రౌండ్ టేబుల్ సమావేశంలోమాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వాలు ప్రజల పైన మోయలేని కరెంటు భారాలను వేస్తున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారాలు ప్రజల పైన వేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకొచ్చిన సంవత్సర కాలంలోనే రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపిందన్నారు. వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడుతున్నప్పుడు తెలుగుదేశం కూటమి నేత నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు పెడితే వాటిని పగలగొట్టండని చెప్పిన టిడిపి నాయకులు ప్రజలకు కరెంటు చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఇది చాలా దుర్మార్గం అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కె. సుధాకరప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఎం.నాగరాజు ,డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి ఎస్. హుస్సేన్ భాష, డివైఎఫ్ఐ ఓల్డ్ సిటీ కార్యదర్శి మధు, కెవిపిఎస్ న్యూ సిటీ అధ్యక్షులు జి. ఏసు రాజు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఆర్. పెదబాబు మాట్లాడారు. మోడీ ఆదేశాలకు లొంగిన వైసీపీ ప్రభుత్వం అదానీ కంపెనీ నుండి సెకి సంస్థ ద్వారా 25 సంవత్సరాల పాటు 7 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నదన్నారు. గత వైసిపి ప్రభుత్వ పెద్దలకు రూ.1750 కోట్ల లంచాలు ఇచ్చి ఈ ఒప్పందం చేసుకున్నారని అమెరికా కోర్టులో సాక్షాదారాలతో కేసు నమోదయిందన్నారు. ఈ ఒప్పందం వల్ల 25 సంవత్సరాల కాలంలో రూ.1,20,000 కోట్ల కరెంటు భారం ప్రజల పైన పడుతుందన్నారు. సిఐటియు జిల్లా నాయకులు జి .గోపాల్, సివిల్ సప్లై హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణ, సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఎస్.అబ్దుల్లా, ఆటో యూనియన్ న్యూ సిటీ అధ్యక్షులు హుస్సేన్ వలి, ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ అధ్యక్షులు కుమార్‌లు మాట్లాడారు. ఐదు కరెంటు సబ్ స్టేషన్ల వద్ద ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ, సంతకాల సేకరణ చేసి ప్రజలను చైతన్యం చేసి ప్రజలు కార్మికులు పెద్ద సంఖ్యలో కరెంటు సబ్‌స్టేషన్ల వద్ద ఆగస్టు 5న ధర్నా చేస్తామన్నారు.



-ప్రజా సంఘాల ఐక్యవేదికలో మాట్లాడుతున్న సిహెచ్ సాయిబాబ



యోగా పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న డాక్టర్‌శంకర్ శర్మ

జిల్లా స్థాయి యోగా పోటీలు ప్రారంభం

యోగ ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్‌శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు జల్లాపరిషత్

కర్నూలు జిల్లా యోగాసన చాంపియన్ షిప్ పోటీలను డాక్టర్ శంకర్ శర్మ ప్రారంభించారు. నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన ఈపోటీల ప్రారంభకార్యక్రమంలో మఖ్య అతిథిగా డాక్టర్ శంకర్ శర్మ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగా భారతదేశంలోనే ప్రారంభమయ్యిందని పురాణాల్లో సైతం యోగా గొప్ప తనాన్ని వివరించారన్నారు. విద్యార్థులు యోగా చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరిగి చదువుల్లో రాణిస్తారన్నారు. యోగా వల్ల క్రమశిక్షణ పెరిగి మంచి జీవనశైలి ఏర్పాడుతుందన్నారు. మైండ్ కంట్రోల్ ఉండాలంటే యోగా చేయాలన్నారు. యోగా చేయడం వల్ల ఎన్నో రోగాలు రాకుండా ఉండడంతో పాటు అవి నయం అవుతాయన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ యోగా గొప్ప తనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. యోగాలో ధ్యానం, వ్యాయామం కలిసి ఉంటుందని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. చిన్న తనంలోనే విద్యార్థులు యోగా పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.ఈపోటీల్లో విజేతలు రాష్ట్ర స్థాయిలో ఆగస్టు21న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. శివరాజ్, ఈ. ప్రభాకర్, అంజనీ భూషణ, హర్ష వర్ధన్, రామాంజనేయులు, చిన్న సుంకన్న, హరి నాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు టీచర్ల ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-సిబెళగల్

సి బెళగల్ మండలంలో బురాన్ దొడ్డిలో ప్రాథమిక పాఠాశాల హెచ్ ఎం సావిత్రి,గురుకులం పాఠశాలలో లెక్చరల్ విజయుడు, సి బెళగల్ హైస్కూల్ లో జూనియర్ అసిస్టెంట్ నాగన్న లు గురువారంఉద్యోగ విరమణ పొందారు. ఇక్కడే తోటి ఉపాధ్యాయులు, తోటి ఉద్యోగులు, శ్రేయోభిలాషులు వారికీ వీడ్కోలు పలికారు. ముందుగా వారు చేసిన సేవలు, విధుల్లో అందించిన బోధనలపై పలువురు కొనియాడారు. విశ్రాంతి దినములను కుటుంబంతో హాయిగా గడపాలని తెలిపి ఘన సన్మానం చేశారు. గురుకుల పాఠశాలలో డిసిఒ శ్రీదేవి, సి బెళగల్, బురాన్ దొడ్డిలో ఎంఇఒలు జ్యోతి, ఆడమ్ బాషాలు పాల్గొని ఉద్యోగ దర్మంలో బదిలీలు, పదవి విరమణ తప్పనిసరిగా ఉంటాయని పేర్కొన్నారు.




ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

సహకార సంఘం సిఇఒ విరమణ

- శేష జీవితం సుఖశాంతులతో కొనసాగించాలి - చైర్మన్ ధర్మపురం గోపాల్

ప్రజాశక్తి - నందవరం


సుదర్శనంను సన్మానిస్తున్న సిబ్బంది

నందవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమిత సంఘం సిఇఒగా పని చేస్తున్న సుదర్శనం గురువారం విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని సొసైటీ ద్వారా రైతులకు 30 ఏళ్లుగా సేవలందించానని, రైతులతో విడదీయలేని అనుబంధం ఏర్పడిందని తెలిపారు. సొసైటీ సిబ్బంది తనకు వృత్తిరీత్యా సహాయ, సహకారాలు అందించేవారని, సొసైటీ సిబ్బందికి, రైతులకు, విరమణ కార్యక్రమానికి వచ్చిన నాయకులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘం చైర్మన్ ధర్మపురం గోపాల్, డైరెక్టర్ భీమశేఖర్, మహేష్ ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడారు. విరమణ ప్రతిఒక్కరి జీవితంలో సర్వసాధారణమని తెలిపారు. శేష జీవితం సుఖశాంతులతో గడపాలని ఆకాంక్షించారు. సొసైటీ సిబ్బంది వేణుగోపాలరావు, ప్రతాప్, వీరేష్, మల్లికార్జున, భరత్ ఆయనను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిబ్బందితో ఆయన స్నేహభావంతో ఉండేవారని, ఎన్ని బాధలున్నా ప్రేమతో పలకరించే వారని తెలిపారు.

'కూటమి'తోనే అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి - హాలహర్వి


వైకుంఠం దంపతులకు సన్మానం

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకురాలు వైకుంఠం జ్యోతి తెలిపారు. గురువారం హాలహర్విలో 'సుపరిపాలన తొలి అడుగు' నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. మండలంలోని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన గురించి వివరించారు. కన్వీనర్లు విజయభాస్కర్ గౌడ్, తిపయ్య, షేక్షావలీ, అసుండి శ్రీధర్, మారుతి, ప్రకాష్, బసప్ప, జనసేన కన్వీనర్ చంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి : సిడిపిఒ

ప్రజాశక్తి - ఆదోని


ఉమామహేశ్వరిని సన్మానిస్తున్న అంగన్వాడీ ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరి అని సిడిపిఒ ఉమా మహేశ్వరి తెలిపారు. గురువారం ఆమె ఉద్యోగ విరమణ కార్యక్రమం ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగింది. అంగన్వాడీలు పూలమాల, శాలువాతో ఉమా మహేశ్వరి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 35 ఏళ్ల పాటు ఉద్యోగంలో ఎలాంటి ఆరోపణలకూ తావు లేకుండా బాధ్యతాయుతంగా పని చేశామని తెలిపారు. సిడిపిఒగా ఆమె సేవలను పలువురు కొనియాడారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, నాయకులు వరలక్ష్మి, సోమక్క, రిజ్వాన, కరుణ, పద్మ, కార్యాలయ అధికారి రాజశేఖర్ చౌదరి, శంకర్, అంగన్వాడీలు జానకి, శారద పాల్గొన్నారు.

నదీ ప్రవాహాన్ని పరిశీలించిన డీఎస్పీ

ప్రజాశక్తి - మంత్రాలయం


అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి

తుంగభద్ర నదీ ప్రవాహాన్ని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి పరిశీలించారు. గురువారం శ్రీరాఘవేంద్రస్వామి మఠం వెనక ఉన్న తుంగభద్ర నదిలో ఘాట్ వద్ద కట్టిన బారికేడ్లను పరిశీలించారు. ఈనెల 8 నుంచి 14 వరకు శ్రీమఠంలో జరగనున్న శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన జాగ్రత్తలు, భద్రత కల్పించాలని సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్‌కు సూచించారు. సుమారు 30 సెక్యూరిటీ పాయింట్లు ఎక్కడ, ఏ ప్రదేశాల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా నదీతీరం వెంట బారికేడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దోపిడీని అరికట్టలేరా.. స్వామి..?

- సబ్ కలెక్టర్ ఆదేశాలు... బేఖాతరు..! - ఉరుకుందలో ఇష్టారాజ్యం..!

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో భక్తులను నిలువు దోపిడీ చేసే సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. శ్రావణమాస ఉత్సవాల్లో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దేవదాయ శాఖ నిబంధనలను గాలికొదిలి


'గుండు' గీస్తున్న కల్యాణ కట్ట కార్మికులు

అక్రమ ఆదాయానికి పెద్ద పీట వేసి భక్తుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఈ నిలువు దోపిడీతో రూ.కోట్లకు పడగెత్తిన ఆచార్య పోవాల్సిన అవసరం లేదు. ఈ దోపిడీని అరికట్టే వారే లేరా స్వామి అంటూ భక్తులు శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని వేడుకుంటున్నారు..!

శ్రావణ మాసోత్సవాల్లో స్వామివారి దర్శనం కోసం సుమారు 15 లక్షల మంది భక్తులు వస్తుంటారు. చాలామంది భక్తులు మొక్కుబడుల కింద టెంకాయలను, తలనీలాలను సమర్పించడం ఆనవాయితీగా ఉంది. ఈ ఉత్సవాల్లో సుమారు 6 లక్షల టెంకాయల అమ్మకాలు జరుగుతాయి. లక్ష మందికి పైగానే భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. దీనిని ఆసరాగా చేసుకుని టెండరు పాటను దక్కించుకున్న గుత్తేదారుడు టెంకాయ రేట్లు ఇష్టానుసారంగా పెంచి సొమ్మును చేసుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యారు. దేవదాయశాఖ టెండర్ల నిబంధనల ప్రకారం కేవలం రూ.20లకు ఒక టెంకాయ విక్రయించాల్సి ఉంది. జత టెంకాయలు రూ.100లకు విక్రయిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భక్తులు నిలువు దోపిడీకి గురికావాల్సి వస్తుంది. ఇదే తీరు ఒక సంవత్సరం మొత్తం కొనసాగితే ఎంత దోపిడీకి గురవుతారో ఉరుకుంద ఈరన్న స్వామికే ఎరుక..!

శ్రావణమాసోత్సవాల్లో భక్తులు తలనీలాలు సమర్పించే కల్యాణ కట్టలో ఇంకా విచిత్రంగా ఉంది. ఒక భక్తుడు తలనీలాలు సమర్పించడానికి దేవాలయం కౌంటర్లు రూ.40 చెల్లించి టిక్కెట్టు తీసుకుంటారు. టికెట్ కల్యాణ కట్టలో సమర్పించి గుండును గీయించుకోవాల్సి ఉంది. ఈ టికెట్ల ఆధారంగా కల్యాణ కట్టలో పనిచేస్తున్న కార్మికులకు గౌరవ వేతనం కింద కొంత మొత్తాన్ని అధికారులు చెల్లిస్తారు. సుమారు లక్ష మందికి పైగానే భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ కల్యాణ కట్టలో ఒక భక్తుని నుంచి రూ.100 అదనంగా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన భక్తులు ఎంత నిలువు దోపిడీకి గురవుతారో దేవదాయ శాఖ అధికారులే చెప్పాలి..!

గుండుకు రూ.100 చెల్లించాల్సిందే

- భక్తుడు నరేష్, కర్నూలు



శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలోని కల్యాణ కట్టలో గుండు గీయించుకోవాలంటే రూ.100 చెల్లించాల్సిందే అని కర్నూలు నగరానికి చెందిన నరేష్ అనే భక్తుడు తెలిపారు. ప్రతేడాది ఉత్సవాలకు వస్తానని, అయినా ఈ నిలువు దోపిడీ ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇస్తేనే గుండు 'కొడతామని' తెగేసి చెబుతున్నారని బాధను వ్యక్తం చేశారు.

జత టెంకాయలు రూ.100

- భక్తుడు అమ్రేష్, చిన్నహోతూరు



పుణ్యక్షేత్రంలో శ్రావణమాసోత్సవాల్లో జత టెంకాయలు రూ.100కు అమ్ముతున్నారని చిన్నహోతూరు గ్రామానికి చెందిన భక్తుడు అమ్రేష్ తెలిపారు. భక్తులకు అధిక ధరలకు అమ్మితే ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అమ్మితే పేద భక్తుల పరిస్థితి గురించి అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

పక్కీరప్ప తాత మృతి బాధాకరం

ప్రజాశక్తి - ఆస్పరి



పక్కీరప్ప తాత దేవాలయం పూజారి పెద్ద పక్కీరప్ప తాత (85) మృతి బాధాకరమని భజన బృందం సభ్యులు గోవిందప్ప, ఓలేష్, మురళీ రెడ్డి, రాముడు, రంగప్ప, ఉరుకుందప్ప, మహానంది తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. పక్కీరప్ప దేవాలయంలో కొన్ని సంవత్సరాలుగా సేవ చేస్తూ దేవాలయ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. విజయదశమి రోజు కాలం నడివడికలను చెప్పే వారన్నారు. రోజూ లాగే చౌరస్తాకు వచ్చి టీ తాగి ఇంటికి వెళ్లారని తెలిపారు. బిపి డౌన్ కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రైతులకు అవసరమైన సేవలందిస్తాం

- సొసైటీ నూతన చైర్మన్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన సేవలందిస్తామని చైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మంచాల వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా ఎన్.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లుగా డిసి.తిమ్మప్ప, చెట్నిహళ్లి గ్రామానికి చెందిన చేపల నాగేష్ బాధ్యతలు చేపట్టారు. సొసైటీ సిఇఒ ఖాజా హుస్సేన్ రిజిస్టర్‌లో సంతకం చేయించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడారు. టిడిపి ఇన్‌ఛార్జీ, తమ సోదరులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి సహకారం తో అందుబాటులో ఉంటూ రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. పంట రుణాలు, ఎరువులు, రాయితీ విత్తనాలు అందించి రైతుల అభివృద్ధి, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత ఉందని వైసిపి నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని, అన్ని గ్రామాల్లో అవసరమైన రైతులకు అందజేసినట్లు తెలిపారు. అంతకుముందు యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డితో కలిసి మంత్రాలయం చేరుకున్న వారికి టిడిపి శ్రేణులు బాణసంచా పేల్చి సంబరాలతో వారికి, డైరెక్టర్లకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించి స్వాగతం పలికారు.

కలుదేవకుంట చైర్మన్‌గా రాఘమ్మ బాధ్యతలు

మండలంలోని కలుదేవకుంట సహకార సంఘం చైర్మగా టిడిపి నాయకులు కీర్తి శేషులు వగరూరు రామిరెడ్డి సతీమణి రాఘమ్మ బాధ్యతలు స్వీకరించారు. టిడిపి నాయకులు, మంచాల సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డితో కలిసి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సొసైటీ కార్యాలయం చేరుకున్నారు. టిడిపి నాయకులు వారికి శాలువా, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. సొసైటీ చైర్మన్‌గా రాఘమ్మ, డైరెక్టర్లుగా మాలపల్లి లక్ష్మన్న, కలుదేవకుంట కురువ భీమయ్య బాధ్యతలు చేపట్టారు. సిఇఒ వెంకటేష్ రిజిస్టర్‌లో సంతకాలు చేయించారు. బిజెపి ఇన్‌ఛార్జీ ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య, మాలపల్లి మాజీ సర్పంచి చావిడి వెంకటేష్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు మేకల వెంకటేష్, టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, పవన్ కుమార్, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బి.రామకృష్ణ, నాయకులు వగరూరు పవన్ కుమార్ రెడ్డి, కెబి.రఘు, గోపాల్, వీరారెడ్డి, మద్రి నరసింహ, మద్రి శివ, డేవిడ్, రాజు, వీరేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

బిల్లులు చెల్లించకుంటేే పనులెలా చేస్తారు..?

- మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి
- వాడీవేడిగా కౌన్సిల్

ప్రజాశక్తి - ఆదోని

చేసిన పనులకు సకాలంలో బిల్లులు కాకపోవడంతోనే ముందుకు రాలేకపోతున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారని, దీనికి కారణం ఏమిటని మున్సిపల్ చైర్మన్ సిహెచ్.లోకేశ్వరి ప్రశ్నించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ లోకేశ్వరి అధ్యక్షతన జరిగింది. పలు సమస్యలపై కౌన్సిలర్లు, అధికారుల మధ్య వాడీవేడి చర్చ సాగింది. ఈ సందర్భంగా చైర్మన్ లోకేశ్వరి మాట్లాడారు. పట్టణం అభివృద్ధి చెందాలంటే పనులు చేపట్టాలని, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే ఎలా అని, వారికి చెల్లించాల్సిన బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని కమిషనర్ కృష్ణను ప్రశ్నించారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఇబ్బంది లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారని తెలిపారు. రికార్డు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇలా అయితే పనులు చేపట్టడం ఎలా అంటూ నిలదీశారు. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయిస్తున్నామని, కొన్ని మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా ఈనెల 15లోపు పూర్తి చేయించి బిల్లులు విడుదల చూస్తామని వివరించారు. శిథిలావస్థలో ఉన్న బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు నిర్లక్ష్యం జరుగుతూనే ఉందని, దీనికి ఎవరు బాధ్యులంటూ కౌన్సిలర్ సందీప్ రెడ్డి నిలదీశారు. ఎస్టిమేషన్ విషయంలో ఇంజినీరింగ్ అధికారులు ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, వైజి.బాలాజీ, రఘునాథ్ రెడ్డి మండిపడ్డారు. గత నెలలో ఎస్ఎస్ ట్యాంకు కుంగిపోతే కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారమూ లేకుండా అధికారులు ఎమ్మెల్యేతో కలసి పరిశీలించారని, ఇప్పుడు మాత్రం డిపిఆర్ మరమ్మతుల కోసం ఎస్టిమేషన్ తయారు చేయడానికి సుమారు రూ.60 లక్షల మంజూరు కోసం మాత్రం కౌన్సిల్‌లో తీర్మానం పెట్టి ఆమోదించమంటే ఎలా అని వైస్ చైర్మన్ నరసింహులు డిఇ చలపతి రెడ్డిని నిలదీశారు. తానేమి షో చేయడం లేదని, 2020, 2023లో కూడా ఎస్ఎస్ ట్యాంక్ కుంగిపోయిందని, అప్పట్లో ఏం చేశారని, అప్పటి నుంచి శాశ్వత మరమ్మతు కోసం ప్రతిపాదన సిద్ధం చేసి ఉంటే ఈపాటికి పనులు జరిగేవి కదా అని కమిషనర్ కృష్ణ ఎదురు ప్రశ్నించారు. గతేడాది దీనిపై డిపిఆర్ కోసం చర్చ జరిగిందని, అప్పటి చైర్మన్, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే ముందుకు సాగలేదని కౌన్సిలర్ సందీప్ రెడ్డి తెలిపారు. నెలకోసారి జరిగే కౌన్సిల్ సమావేశంలో మాత్రమే కౌన్సిలర్లు గుర్తుకొస్తారని, ఎస్ఎస్ ట్యాంకు కుంగిపోయిన వెంటనే కౌన్సిల్ సమావేశం పెట్టి ఎందుకు చర్చించలేదని సీనియర్ కౌన్సిలర్ బాలాజీ ప్రశ్నించారు. కమిటీని ఏర్పాటు చేసి ఎస్ఎస్ ట్యాంకు సమస్యను ఆదోని నుంచి ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న బిటి.నాయుడు, డాక్టర్ మధుసూదన్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించే ప్రయత్నం చేద్దామన్నారు. పట్టణంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రజలపై దాడి చేస్తున్నాయని, తన కుటుంబ సభ్యులు కూడా బాధితులేనని వైస్ చైర్మన్ ఎంఎంజి.గౌస్ తెలిపారు. అధికారులు చేస్తున్న ఆపరేషన్లు ఫలితం ఇవ్వడం లేదని, వాటి సంతతి పెరుగుతూనే ఉందని చెప్పారు. కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలన్నారు. ఆపరేషన్లు సక్రమంగా చేస్తున్నామని, వాటి సంతతిని నియంత్రిస్తామని హెల్త్ ఆఫీసర్ సందీప్ తెలిపారు.

ఎవరి మెప్పు కోసం పాకులాడుతున్నారు

పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ సమీపంలో ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్న దుకాణాలను తొలగించే ప్రయత్నం అధికారులు ఎవరి మెప్పు కోసం చేస్తున్నారని వైస్ చైర్మన్ నరసింహులు నిలదీశారు. హైవే రోడ్డు పనులు జరిగినా అభ్యంతరం లేనప్పుడు అక్కడ ట్రాఫిక్ లేకున్నా ఎందుకు కూల్చడానికి వెళ్లారని, అక్కడ ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులంటూ నిలదీశారు. కౌన్సిల్‌లో తీర్మానం చేసిన తర్వాతనే ఏవైనా కూల్చాలని, సొంత నిర్ణయాలు తీసుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

సమస్యలపై ఎన్నిసార్లు చెప్పాలి

పట్టణంలోని ఫరిస్తా మొహల్లా 27వ వార్డులో తాగునీటి పైపులైన్ వేయాలని ప్రతి సమావేశంలోనూ కోరుతున్నానని, ఎందుకు చేయడం లేదని కౌన్సిలర్ ఖైరన్ ప్రశ్నించారు. పైపులైన్ పనుల కోసం నాలుగు సార్లు టెండర్లు పిలిస్తే ఎవరూ రావడం లేదని కమిషనర్ తెలిపారు. హనుమాన్ నగర్‌లో వర్షపు నీరు ఇళ్లలోకి వస్తున్నాయని, డ్రెయినేజీ నిర్మించాలని 30వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి కోరారు. కౌన్సిల్ అజెండాను సాయంత్రం ఇస్తే ఎలా సిద్ధం కావాలని కౌన్సిలర్ పార్వతి తెలిపారు. తహశీల్దార్ రమేష్, ఎంఇ సత్యనారాయణ, డిఇలు చలపతి, రామ్మూర్తి, టిపిఒ బాలమద్దయ్య, ఆర్ఒ నాసిర్ హుస్సేన్, అకౌంట్ ఆఫీసర్ రవికుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మెప్మా అధికారి వీరారెడ్డి, కౌన్సిలర్లు చలపతి, అశోక్, కీర్తన, ప్రతిభ, ఇందు, ఇంతియాజ్, సురేష్ పాల్గొన్నారు.


కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న చైర్మన్ లోకేశ్వరి

ఎంఇఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కోసిగి



కోసిగి ఎంఇఒగా బాలయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు మండలం హుళేబీడు ఉన్నత పాఠశాల నుంచి కోసిగి ఎంఇఒగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. కోసిగిని అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. విద్యాశాఖలో ఏమైనా సమస్యలుంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాని చెప్పారు. జంపాపురం గ్రామానికి చెందిన కొంతమంది విద్యార్థులకు స్పోర్ట్స్ పాఠశాలలో మెరిట్ సాధించినా సీటు రాలేదని ప్రజాశక్తి విలేకరి తెలుపగా... ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సీటు రాకపోవడానికి గల కారణాలను తెలుసుకొని అవకాశం ఉంటే ఆ విద్యార్థులకు న్యాయం చేస్తామన్నారు.

2న రౌండ్ టేబుల్ సమావేశం

- సిఐటియు, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఈనెల 2న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఐటియు, కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.రాముడు, కెవిపిఎస్ మండల నాయకులు రాజా రమేష్ తెలిపారు. గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాలకు సిఐటియు, కెవిపిఎస్ ఆహ్వానం పలికారు. వారు మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల నుంచి జరిగిన నష్టాన్ని ప్రజల్లో తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల నష్టాలపై యువతకు అవగాహన ఉండాలని కర్నూలు ఎస్ఐ సుజన్ కుమార్, ఎమ్మిగనూరు ఈగల్ టీం సభ్యులు రమేశ్, ఎలిషా తెలిపారు. గురువారం ఈగల్ టీం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్యపరమైన, సామాజికపరమైన, శిక్షాపరమైన అనర్థాలను విద్యార్థులకు వివరించారు. సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధాకర్ పాల్గొన్నారు.

పేదల ప్రాణాలతో చెలగాటం

- హోళగుంద పిహెచ్‌సిలో కాలం చెల్లిన మందులు
- పట్టించుకోని వైద్యాధికారులు

ప్రజాశక్తి- హోళగుంద

వైద్యో నారాయణ హరి అన్నారు పెద్దలు. అలాంటి వైద్యులే పేదల ప్రాణాలతో చెలగాటం ఆడతున్నారు. హోళగుంద ప్రభుత్వాసుపత్రిలో మాత్రం రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు, ప్రతిరోజు ఆసుపత్రికి సకాలంలో వచ్చి వైద్య సేవలు అందించవలసి ఉండగా ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి నెలకొందని రోగులు మండిపడుతున్నారు. వారంలో చాలాసార్లు ఒకటి రెండు రోజులు వచ్చి పోతున్నట్లు తెలుస్తోంది. వైద్యులు అందుబాటులో లేక పోవడం వల్ల వచ్చిన రోగులకు అక్కడున్న ఏఎన్ఎంలు వైద్య సేవలు అందించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అత్యవసర కేసులు పాముకాటు, పురుగుల మందుతు తాగిన వ్యక్తులు, గర్భిణీలు ఆస్పత్రికి వచ్చినా వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల కర్ణాటక రాష్ట్రం బళ్ళారి, ఆదోని ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి సొంతంగా డబ్బులు వెచ్చించి అప్పుల పాలవుతున్నారు. ఇదిలా ఉంటే ఓ వైపు ఏకంగా కాలం చెల్లిన మందులను ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కాలం చెల్లిన మందులను పేదలకు సేవలందించే ప్రదేశాల్లో బహిరంగంగా ఉంచారు. కొంతమంది చదువుకున్న యువకులు కాలం చెల్లిన మందులను చూసి వీటితో మాకు వైద్యం చేస్తే ప్రాణాలు గాల్లో కలుస్తాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు.


రోగుల పట్ల నిర్లక్ష్యం

ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరించడమే కాకుండా వారు ఏదైనా అడిగితే ఇక్కడ ఇంతే మందులు లేవు పో అంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేందుకు వీలున్న ప్రసవాలు కూడా పిహెచ్‌సిలో చేయకుండా ఆదోనికి, బళ్లారికి రిఫర్ చేస్తున్నారని రోగులు చెబుతున్నారు. కొన్ని మందులు బయట ప్రైవేట్ మెడికల్ షాపులకు రాస్తున్నట్లు తెలిసింది. హోళగుంద పిహెచ్‌లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షణ చేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పిహెచ్‌సి వైద్యాధికారి న్యూటన్‌ను వివరణ కోరగా 'ఊరికే అక్కడ ఉంచాం. ఆ మందులను ఇవ్వం. వాడబోం' అని తెలిపారు.



తపాలా బంట్రోతుకు ఘన వీడ్కోలు

- 40 ఏళ్లుగా ఒకే గ్రామంలో సేవలందించిన పోస్ట్ గోపాల్


గోపాల్‌ను ఊరేగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల

పోస్ట్ గోపాల్ అంటే గ్రామంలో అందరికీ సుపరిచితమైన పేరు. ఒకే గ్రామంలో సుమారు 40 ఏళ్ల సేవలందించిన పోస్ట్ గోపాల్‌కు గ్రామంలో ప్రతి ఇల్లు, ప్రతి వీధి, ప్రతి వ్యక్తి గురించి తెలుసు. దశాబ్దాలుగా గ్రామంలో అందరికీ తీపి, చేదు వార్తలను చేరవేసిన వ్యక్తి గోపాల్. ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆత్మీయులకు సంబంధించిన సుఖదుఃఖాల సమాచారాన్ని ఉత్తరాల రూపంలో అందజేశారు. అలాంటి గోపాల్ గురువారం విరమణ పొందారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ సిబ్బంది స్థానిక పోస్ట్ ఆఫీస్ నుంచి అతని స్వగృహం వరకు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి సేవలను కొనియాడుతూ మేళతాళాలతో అతని సేవలకు ఘనమైన వీడ్కోలు పలికారు. పోస్ట్ మాస్టర్ హర్షవర్ధన్, పోస్ట్‌మ్యాన్ దాదాబాషా, ప్యాకర్స్ శ్రీనివాసులు, సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్‌వి.రామాంజనేయులు, టిడిపి కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, నాయకులు బేతాళ బడేసాబ్, టౌన్ ప్రెసిడెంట్ రహమతుల్లా, సర్పంచి దంపతులు హైమావతి, చంద్రశేఖర్, బాబు నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలు పట్టని 'కూటమి' : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పాఠశాలల సమస్యలపై సత్వరమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, సిపిఎం పట్టణ కమిటీ నాయకులు లక్ష్మీ నరసయ్య, రమేష్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల సమస్యలను సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం 'నాడు-నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెప్పి, నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అనేక పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కాక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. శ్రీనీలకంఠేశ్వర ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల కటికపేట, ఎంపిపి స్కూల్ చంద్రయ్య కొట్టాల, తెలుగు మెయిన్ స్కూల్, పై మాలగేరి పాఠశాల, బైపాస్ రోడ్డు పాఠశాల్లో సమస్యలను పరిశీలించారు. కార్యకర్తలు మాదన్న, నామాల రాముడు పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని ప్రకాష్ నగర్, కల్లుబావి హై స్కూల్‌లో తరగతి గదుల సంఖ్య పెంచి, ఉపాధ్యాయులను నియమించాలి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాయకులు మల్లయ్య కోరారు. పట్టణంలోని ప్రకాష్ నగర్ మున్సిపల్ స్కూల్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ... మధ్యకాలంలో ప్రభుత్వం ఈ స్కూల్‌ను ఎలిమెంటరీ నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసిందని, స్కూల్ స్థాయి పెరిగిన గదుల సంఖ్య పెరగలేదని తెలిపారు. ఒక్కో గదిలో సుమారు 90 మంది విద్యార్థులు ఉంటున్నారని చెప్పారు. 1 నుంచి 6వ తరగతి వరకు సుమారు 236 మంది విద్యార్థులకు, కేవలం ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. హైస్కూల్‌లో 272 విద్యార్థులకు కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారని చెప్పారు.


ఎమ్మిగనూరులో సర్వే నిర్వహిస్తున్న నాయకులు


ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

- వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి


మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, రజక వృత్తిదారుల సంఘం మండల కార్యదర్శి ఈరన్న కోరారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో వామపక్ష, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారం వేసిందని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం నడుస్తోందని, బడా కంపెనీల లాభాలు, అధినేతల జేబులు నింపుకోవడం కోసం విద్యుత్ బిల్లు ఎక్కువగా వేస్తున్నారని మండిపడ్డారు. షాపులు, పరిశ్రమలకు యూనిట్ 6 పైసలుగా ఉన్న విద్యుత్ సుంకాన్ని రూ.2కు పెంచారని పేర్కొన్నారు. చిరువ్యాపారుల షాపులకు, చిన్న పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత 10 రెట్లు బిల్లులు పెరిగాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. ఫిర్యాదు చేస్తే 'ముందు బిల్లు కట్టండి. తర్వాత చూస్తాం' అంటున్నారని చెప్పారు. ఈనెల 5న ఆస్పరి విద్యుత్ కార్యాలయం ముందు వామపక్షాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు చిన్న మల్లేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తరుణ్ పాల్గొన్నారు.

'కూటమి'తో సుపరిపాలన: టిడిపి

ప్రజాశక్తి - ఆస్పరి


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వీరభద్ర గౌడ్

రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యమని టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, బిజెపి తాలూకా ఇన్‌ఛార్జీ వెంకట రాముడు తెలిపారు. గురువారం ఆస్పరిలో ' సుపరిపాలన తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా స్థానిక టిడిపి నాయకులు, వారికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హంద్రీనీవా నుంచి పైపులైన్ వేసి జొహరాపురం గ్రామంలో స్టోరేజ్ సంపు ఏర్పాటు చేసి మండలానికి తాగునీరందిస్తానని హామీఇచ్చారు. మల్లేశ్వర స్వామి దేవాలయానికి రూ.3.25 కోట్లతో సిసి రోడ్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. టిడిపి మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, జనసేన మండల కార్యదర్శి వీరేష్, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాలీ సాబ్, టిడిపి సీనియర్ నాయకులు సాయిబాబా, సంజప్ప, రామలింగప్ప, సతీష్, యుగంధర్, రంగనాథ్, రాజ్ కుమార్, మల్లికార్జున, బసవరాజు, వీరేష్, ఉచ్చీరప్ప, బిజెపి నాయకులు సంజప్ప, కాశమ్మ, మురళీ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు అప్పగించాలి

ప్రజాశక్తి - ఆదోని

టిడ్కో గృహాల కోసం డిపాజిట్లు చెల్లించి సంవత్సరాలు గడిచినా నివాసాలు కేటాయించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదని, గృహాలను అప్పగించాలని లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కమల నాభ స్వామి, వెంకటేశ్వర్లు, రమణ మాట్లాడారు. 2017లో టిడ్కో గృహాల కోసం రూ.50 వేలు, రూ.లక్ష చొప్పున 340 మంది ప్రభుత్వానికి చెల్లించామని తెలిపారు. ఆ ఇళ్లపై బ్యాంకుల్లో రుణాలు ఉండటం వల్ల రికవరీ పేరుతో మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల అమౌంట్ వచ్చినా ఇన్‌స్టాల్‌మెంట్ పేరుతో బ్యాంకు అధికారులు రికవరీ చేస్తూ తమను డిఫాల్ట్ కింద చూపెడుతున్నారన్నారు. అధికారులు స్పందించి గృహాలు కేటాయించాలని, లేకపోతే డిపాజిట్ అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సముదాయం వద్ద రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యాయని, ప్రభుత్వానికి వివరాలు పంపుతామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఇంతవరకు చేసిన రికవరీ అమౌంట్ వివరాలను ప్రభుత్వానికి పంపి జమ అయ్యేలా చూస్తామని తెలిపారు.



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు



ఉరుకుందలో పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాసోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. గురువారం ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. తుంగభద్ర దిగువ కాలువలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి ఇష్టమైన నైవేధ్యాన్ని వండి పూజలు చేశారు. మరి కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. బుధవారం రాత్రి భక్తులు భారీ సంఖ్యలో పుణ్యక్షేత్రానికి చేరుకోవడంతో ఆలయ అధికారులు తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులను కొనసాగించారు. దేవాలయం టికెట్ల కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. డిప్యూటీ కమిషనర్ విజయరాజు, దేవాలయ పర్యవేక్షకులు మల్లికార్జున వెంకటేష్, సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పర్యవేక్షించారు. ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని బళ్లారి, సిరుగుప్ప, రాయచూర్ ఆర్‌టిసి డిపోల నుంచి భక్తుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యాలను కల్పించారు. సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి సంఘటనలూ జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కారు పార్కింగ్‌కు స్థలాల కేటాయింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కారు పార్కింగ్ కోసం స్థలాలు కేటాయించినట్లు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు తెలిపారు. గురువారం స్థానిక బృందావన గార్డెన్ అతిథి గృహం వద్ద నూతనంగా నిర్మించిన డార్మెటరీ హాలును పరిశీలించారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ బరోడాపై నూతనంగా నిర్మిస్తున్న లాకర్ రూమ్‌ల పనులను తనిఖీ చేశారు. ఇటీవల ఎమ్మిగనూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా మంత్రాలయం వచ్చిన భార్గవి పీఠాధిపతులను కలిసి ఆశీస్సులు పొందారు. ఈనెల 8 నుంచి 14 వరకు జరిగే శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలకు వచ్చే విఐపిలకు, భక్తులకు రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న పాత ఆర్ అండ్ బి అతిథి గృహం, నాగలదిన్నె రహదారిలోనూ, ఎమ్మిగనూరు రహదారిలోనూ కార్ పార్కింగ్ కోసం స్థలం కేటాయించినట్లు తెలిపారు. సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, సిఆర్ఒ విజయీంద్ర చార్, నాగరాజాచార్, హనుమేషాచార్, ఇంజినీర్ శ్రీనివాసులు, చిగిలి హనుమంతు ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని చిన్నభూంపల్లి గ్రామంలో బుధవారం జరిగిన హత్య సంఘటన స్థలాన్ని డీఎస్పీ భార్గవి, సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాడి చేయడానికి గల కారణాలను బంధువులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ అధికారులు, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ అధికారులు రక్త మరకల నమూనాలను సేకరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. పిల్లలను బాగా చదివించి, దురలవాట్లకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. దాడి చేసిన మృతురాలి భర్త దుద్ది ఈరన్న గారి నరసింహులును అదుపులో తీసుకొని పూర్తిస్థాయిలో విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఫోరెన్సిక్ అధికారులు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప

వసతి గృహానికి మరో బిల్డింగ్ ఏర్పాటు చేయాలి - ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని వసతులతో వసతి గృహానికి మరో బిల్డింగ్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగప్ప మాట్లాడారు. బీసీ ప్రీ మెట్రిక్ ప్రభుత్వ హాస్టల్‌లో 400 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, వారికి కేవలం 10 స్నానపు గదులే ఉన్నాయని తెలిపారు. ఉదయం పాఠశాలలకు సిద్ధం కావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాత్రి విద్యార్థుల ట్రంప్ పెట్టెలను ఒకదానిపై ఒకటి ఉంచి నిద్ర పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మరో ప్రయివేట్ బిల్డింగ్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. బీసీ వసతి గృహాల పర్యవేక్షణలో భాగంగా ఎమ్మిగనూరుకు వచ్చిన జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి విద్యార్థులతో మాట్లాడి పత్రిక ప్రకటనలు ఇచ్చారని, విద్యార్థులకు ప్రభుత్వ బిల్డింగ్ నిర్మించడం, మరో ప్రయివేట్ బిల్డింగ్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బీసీ సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేసి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులను కలుపుకొని ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పట్టణ నాయకులు నితీష్, అజయ్, హుస్సేన్, సూరి పాల్గొన్నారు.

'అవగాహనతోనే క్షయ నివారణ'

ప్రజాశక్తి - ఆదోని


క్షయ వ్యాధి పట్ల అవగాహన అలవర్చుకొని తగిన జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చని శంకర్ నగర్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ పృథ్వీరాజ్, డాక్టర్ షేకున్ భాను తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ప్రిన్సిపల్ అంజలి దేవి, శాంతి, సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, మేరీ, అరుణ, సుబ్బమ్మ బాయి, ఎఎన్ఎం బుజ్జెమ్మ, ఆశావర్కర్లు నాగలక్ష్మి, ఈరమ్మ, శాంతి, చిట్టెమ్మ పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న సిబ్బంది

అనువైన ఇంటి స్థలాలివ్వాలి

- టిడిపి టౌన్ ప్రెసిడెంట్ కాశీ విశ్వనాథ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో అర్హులైన నిరుపేదలకు అనువైన ఇంటి స్థలాలు ఇవ్వాలని టిడిపి టౌన్ ప్రెసిడెంట్ కాశీ విశ్వనాథ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఇంటి స్థలాలు ఇచ్చారని, లోతట్టు ప్రాంతం కావడం, నివాసానికి యోగ్యం కానీ స్థలం కావడంతో అక్కడికి ఎవరూ వెళ్లలేకపోయారని తెలిపారు. పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రాజబాబు, మహిళలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 2న కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నామని ఎస్‌టియు సీనియర్ నాయకులు మునపాటి సూర్యుడు తెలిపారు. గురువారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంఇఓ పోస్టులకు ప్రభుత్వ యాజమాన్యంలోని గ్రేడ్-1 ప్రధానోపాధ్యాయులనే కాకుండా పాఠశాల సహాయకులకు ప్రమోషన్ కల్పించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఎంఇఓగా ప్రమోషన్ కల్పించడం వల్ల జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పి4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తూ మానసికంగా ఒత్తిడి గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా తమ ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు పిఆర్‌సి, ఐఆర్, డిఎ, ఇతర బకాయిలు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఈనెల 2న ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, రామకృష్ణ, సుధాకర్, ఆంజనేయ, కోటేశ్వరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునపాటి సూర్యుడు

ఎంఇఓ పోస్టులను మున్సిపల్ ఉపాధ్యాయులకు కేటాయించాలి : ఎంటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఎంఇఓ పోస్టులను మున్సిపల్ ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలని ఎంటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారి కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు జంగం బసవరాజు, నాగేశ్వర నాయుడు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 59 అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ పాఠశాలలు ఎస్టాబ్లిష్ అయి ఉన్నందున మున్సిపల్ ఉపాధ్యాయులకు కనీసం ఆయా అర్బన్ లోకల్ బాడీల్లో విద్యాధికారుల పోస్టులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, కార్పొరేషన్ యాక్ట్ ప్రకారం విద్యాధికారిగా ప్రమోషన్ పొందే అవకాశం ఉన్నప్పటికీ విద్యాశాఖ ఆధీనంలోకి వచ్చాక ఎంఇఓ పోస్టుల భర్తీలో మున్సిపల్ ఉపాధ్యాయులకు మొండి చేయి చూపడం బాధాకరమన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు అర్బన్ ప్రాంతాల్లో అవకాశం కల్పించాలని, సమాన హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతాప్ రెడ్డి, నూరుల్ హక్, కోటన్న, ఎల్లాగి, గుర్రప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు : వైసిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని, కూటమి హామీలపై ప్రజలు ప్రశ్నించాలని వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, 17వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి, వార్డు ఇన్‌ఛార్జీ రామాంజిని రెడ్డి, 18వ వార్డు ఇన్‌ఛార్జీ బోయి సోమేష్ కోరారు. గురువారం పట్టణంలోని 17వ, 18వ వార్డుల్లో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను గుర్తు చేసి, వాటి అమలులో ఎదురైన మోసాన్ని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటి వద్ద క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి, కుటుంబాలకు తలపెట్టిన నష్టాన్ని వివరించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, జిల్లా చేనేత అధ్యక్షులు ఎంకె.శివ, జిల్లా అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్, జిల్లా అంగన్వాడీ విభాగ కార్యదర్శి సావిత్రమ్మ, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు విశ్వనాథ్, రమేష్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బోయ బజారి, పట్టణ మహిళా అధ్యక్షులు లతారెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షులు బోయ రాజు, కో ఆప్షన్ సభ్యులు అబ్రార్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శులు గడ్డం అంజి, యుయు.నాగేష్, కరే రాము, పట్టణ కార్యదర్శి గుర్వ మాబాష, జెరుబండి రఘువీరా, కార్యవర్గ సభ్యులు అల్తాఫ్, 2వ వార్డు ఇన్‌ఛార్జీ చంద్ర, 15వ వార్డు ఇన్‌ఛార్జీ సయ్యద్ ఫయాజ్, 25వ వార్డు ఇన్‌ఛార్జీ జి.శ్రీనివాస్ రెడ్డి, 31వ వార్డు ఇన్‌ఛార్జీ పాల శ్రీనివాస్ రెడ్డి, 33వ వార్డు ఇన్‌ఛార్జీ వడ్డే వీరేష్, నాయకులు మోనే హర్ష సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, నియోజకవర్గ అధ్యక్షులు షరీఫ్, జిల్లా కార్యదర్శి కదిరికోట రాజ్ కుమార్, సభ్యులు జశ్వంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామర్తి నాగేశప్ప



ఎఆర్ ఎస్ఐని సన్మానిస్తున్న ఎస్పి విక్రాంత్ పాటిల్

ఎఆర్ ఎస్ఐని సన్మానించిన ఎస్పి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

సుధీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పోలీసు సిబ్బంది ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆర్మడు రిజర్వుడు హెడ్ క్వార్టర్‌లో పని చేస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందిన ఎఆర్ ఎస్ఐ సయ్యద్ ఇస్మాయిల్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి తన ఛాంబర్ లో శాలువ, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కుటుంబంతో సంతోషంగా గడపాలని, ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ తేజ మూర్తి, ఆర్ ఐ నారాయణ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

విజేతలకు టిజివి అభినందన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్


జాతీయ స్థాయిలో మెరిసిన తైక్వాండో క్రీడాకారులను రాజ్యసభ మాజీ సభ్యులు, మాజీ మంత్రి టిజి వెంకటేష్ గురువారం ఉదయం మౌర్య ఇన్ లోని తన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా టీజీవీ అండ్ టీజీబి తైక్వాండో అకాడమీకి చెందిన విజేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలుగగా, ఆయన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. జూలై 24 నుంచి 28 వరకు విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను టిజి వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు. వారి శిక్షణకు దోహదపడిన కోచ్ టి వెంకటేశ్వర్లును కూడా ప్రశంసించారు.

తెలుగు వెంకటేష్ కు కాశీభట్ల పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్



వైండింగ్ కవిగా ప్రసిద్ధి పొందిన కర్నూలుకు చెందిన తెలుగు వెంకటేష్ కు ప్రతిష్టాత్మకమైన కాశీభట్ల వేణుగోపాల్ పురస్కారం వరించింది. మూడు దశాబ్దాలుగా సాహిత్యంతో ఉన్న తెలుగు వెంకటేష్ ఇప్పటివరకు 2004లో ఒకతడి అనేక సందర్భాలు, 2021లోతూనీగతో సాయంకాలం, 2022లో, నుర్జహానుకు ప్రేమలేఖ, 2023లో కబోది చేపల కబుర్లు, 2024లో రేయిన్ కేఫ్ కవిత్వ సంపుటాలను తీసుకొచ్చారు. ఇప్పటివరకు 2023లో రాధేయ అవార్డు, అదే ఏడాది రొట్టమాకు రేవు అవార్డు, 2024లో ఖమ్మం ఈస్తటిక్ అవార్డు అందుకున్నారు. గాఢత కలిగిన కవిత్వంగా కవిత్వ లోతుల్ని అన్వేషిస్తూ రాసే తెలుగు వెంకటేష్ కు ఈ పురస్కారం ఇస్తున్నామని అక్షరం లిటరరీ ట్రస్ట్ అవార్డు కమిటీ చైర్మన్ డాక్టర్ ఉమానాథరావు, కార్యదర్శి జి.వెంకట కష్ణలు తెలిపారు.



టిపిఆర్ఒను సన్మానిస్తున్న మేయర్ రామయ్య, కమిషనర్ విశ్వనాథ

విరమణ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలకలో పదవీ విరమణ పొందిన టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సాదిక్ హుస్సేన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు గౌడ్‌లను మేయర్ బివై.రామయ్య, కమిషనర్ పి.విశ్వనాథ్ సన్మానించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఇ శేషసాయి, ఆర్ఒ ఇశ్రాయేలు, సూపరింటెండెంట్లు రామకృష్ణ, స్వర్ణలత, కుమార్, కార్పొరేటర్లు విక్రమసింహా రెడ్డి, సాంబశివరావు, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణకాంత్, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

రుతుక్రమ పరిశుభ్రత పై అవగాహన అవసరం

జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వరప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రుతుక్రమ పరిశుభ్రత , నెలసరి సమస్యలపట్ల అవగాహన కోసం కర్నూలు నగరంలోని ఇందిరాగాంధి స్మారక ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు రుతుక్రమం, ప్రారంభం రుతు పరిశుభ్రత గురించి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వరప్రసాద్ మాట్లాడుతూ స్త్రీలలో ప్రతి 28 రోజులకు ప్రకృతి సహజంగా జరిగే జీవక్రియ ,దీనినే రుతుక్రమం అంటరాని తెలిపారు. కౌమారదశ 10-12 సంవత్సరాలలో బాలికలలో రుతుక్రమం మొదలవుతుందని, ఇది సాధారణ ప్రక్రియ, కౌమారదశలో మొదటిసారి నెలసరి కావటం ఈ వయస్సులోనే జరుగుతుందన్నారు. దీనినే పుష్పవతి/పెద్దమనిషి,రజస్వల అవ్వడం అంటారని తెలిపారు. బాలిక 10 నుంచి 17 సంవత్సరాల మధ్యలో ఎప్పుడైనా పెద్దమనిషి అయ్యే అవకాశాలు ఉన్నాయని, 17 సంవత్సరాలకు కూడా అవ్వనట్లయితే వైద్యులను సంప్రదించాలన్నారు. నెలసరి ప్రక్రియ స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థకి సంబంధించినదని తెలిపారు. నెలసరి ఎందుకు వస్తుంది, దాని పరిణామాలు యేమిటోవైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలకు ముందుగానే నెలసరి గురించి వివరించాలని, ఆడపిల్లలకు నెలసరి గురించి ముందుగా తెలియకపోతే వారు రక్తస్రావాన్ని చూసి భయపడుతారన్నారు. తల్లి ఆడపిల్లలకు ముందుగానే నెలసరి గురించి వివరించడం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని , నెలసరి అయిన వెంటనే స్నానం చేయడం , వీలయితే రోజుకు రెండు సార్లు చేయాలి, బట్టను/ప్యాడ్‌ను రెండు పూటలా మార్చుకోవాలన్నారు. బట్ట వాడినట్లైతే సబ్బుతో మరకలు పోయే వరకు ఉతికి వేడి నీటిలో జాడించి ఎండలో ఆరవేయాలన్నారను. జననంగాలను పొడిగా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్నానం చేసేటప్పుడు రోజు శుభ్రపరచుకోవాలన్నారు. ఉతికిన బట్టను ఎండ తగిలే ప్రదేశంలో భద్ర పరచుకోవాలన్నారు. వాడిన బట్టను ఏక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. చెత్త పారా వేసే కుండీలలో లేదా స్కూల్స్ , హాస్టల్స్ అయితే ప్రత్యేకంగా దాని కొరకు పెట్టిన డబ్బాలోనే పారవేయాలన్నారు. అనంతరం ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ ఫ్లోరోసిస్ గురించి వివరించారు. ఆర్ఎస్‌కెఎస్ కన్సల్టెంట్ మల్లికార్జున, ఆరోగ్య కార్యకర్త మేరి, ఆశాకార్యకర్త ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వరప్రసాద్

అత్యవసర సమయాల్లో స్పందించేలా శక్తి యాప్

మహిళల భద్రతకు శక్తి యాప్, వాట్సప్ సేవల పై అవగాహన

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబర్ల పై , గుడ్ టచ్ , బ్యాడ్ టచ్‌ల పై పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ ల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, విద్యార్థినిలకు , మహిళలకు వాటి సేవలను వివరిస్తున్నారని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ గురువారం తెలిపారు. జిల్లాలోని పలు పాఠశాలలు , ఇతర ప్రదేశాలలో, శక్తి యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. బాల, బాలికలకు గుడ్ టచ్ ,బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా బ్యాడ్‌టచ్ చేస్తే వెంటనే గురువులకు, తల్లిదండ్రులకు తెలిపాలన్నారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు రక్షణ , భద్రత ఉంటుందని ప్రతి ఒక్కరు శక్తియాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీంబృందాలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112, ఎస్ఒఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

'శక్తి' వాట్సప్ నెంబర్... 7993485111

మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీసు సేవలను మహిళలకు మరింత చేరువ చేసేందుకు శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవడంతో పాటు శక్తి వాట్సప్ 7993485111 నెంబర్‌ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలన్నారు. మహిళలు శక్తి వాట్సప్ నంబర్ కు కాల్ చేసినా, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటాయని చెప్పారు. 24/7 శక్తి వాట్సాప్ నంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. డయల్ - 112, 181, 1098, 1930 నెంబర్ల ఉపయోగాలు, సోషల్ మీడియా ప్రభావం, చదువుకు ఉన్న ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ రూల్స్, బాల్యవివాహాలు, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించారు.



బాక్సింగ్ ఛాంపియన్ కు సన్మానం

ప్రజాశక్తి-వెల్దుర్తి

ఇండో-నేపాల్ ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్-2025 లో ఈనెల 24న నుంచి 28 వరకు నేపాల్ దేశం పోబర సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో విజేతగా నిలిచిన వెల్దుర్తి పట్టణానికి చెందిన వై.మహేశ్ ను, కోచ్ ఫయాజ్ ను పట్టణ వాసులు, సిపిఐ నాయకులు, కుటుంబ సభ్యులు ఎరుకలి మద్దిలేటి, జ్యోతి తదితరులు, బంధు మిత్రులు గురువారం ఘనస్వాగతం పలికారు. పట్టణానికి చేరుకున్న విజేతను, కోచ్ ఫయాజ్‌ను ముందుగా పూలమాలలతో ముంచెత్తి అనంతరం పట్టణ పురవీధుల గుండా బాణా సంచా పేలుస్తూ, ఘనంగా ఊరేగించారు. పాత బస్టాండులో తెలుగుతల్లి.విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించిన సందర్భంగా విజేత కోచ్ ఫయాజ్ మాట్లాడుతూ విజేత మహేశ్ ఇటీవల ఇంటర్ పూర్తిచేసుకున్నాడన్నారు. విద్యార్థి దశ నుంచే అతనికి బాక్సింగ్ పట్ల ఉన్న ఆసక్తితో శిక్షణ తీసుకున్నాడన్నారు. గతేడాది జులైలో జాతీయ స్థాయిలో చెన్నై నెహ్రూ స్పోర్ట్స్ కాంప్లెక్సులో నిర్వహించిన సౌత్ జోన్ బాక్సింగ్ (80-86 కేజీల యూత్ కేటగిరి) ఛాంపియన్‌షిఫ్‌లలో సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో 85 కేజీల యూత్ కేటగిరి విభాగంలో యూత్ అండ్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా, నేపాల్ యూత్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వారు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఛాంపియన్ షిప్లో 8 దేశాల బాక్సర్లు పాల్గొన్నారన్నారు. ఇండియా నుంచి మహేశ్ ఫైనల్‌లోకి ప్రవేశించి నేపాల్ కు చెందిన ప్రత్యర్థిని మట్టికరిపించి విజేతగా నిలిచాడన్నారు. విజేత మహేశ్ మాట్లాడుతూ తన విజయానికి కోచ్, తల్లితండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహమేనన్నారు. అంతర్జాతీయ పోటీలలో పాల్గొని, మెడల్స్ సాధించి, దేశానికి, పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నదే తన లక్ష్యం అన్నారు.



ఛాంపియన్ నుసన్మానిస్తున్న స్థానికులు

అమెరికా సామ్రాజ్యవాధాన్ని వ్యతిరేకించండి

ప్రజాశక్తి కర్నూల్ కలెక్టరేట్

అమెరికా సామ్రాజవాదాన్ని వ్యతిరేకించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ పేర్కొన్నారు.. గురువారం సాయంత్రం ఓర్వకల్ మండలం కేతవరం గ్రామంలో క్యూబా సంఘీభావ నిధిని వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ ,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గ రాముడు , వెంకటస్వామి, బాబు నాగమ్మ , సూర్యనారాయణ పాల్గొన్నారు. జి రామకృష్ణ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా సంఘీభావనిధిని ఎఐకెఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుండి వసూలు చేసి క్యూబాకు సంఘీభావంగా పంపించడం జరుగుతుందని అన్నారు, అమెరికా క్యూబా సోషలిస్టు ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం అనేక సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉందని అందులో భాగంగా అనేక ఆంక్షలు క్యూబా పై కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .అయినా క్యూబా అమెరికా సామ్రాజ్యవాదానికి తలొగ్గకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. సోషలిస్ట్ క్యూబాకు దేశ ప్రజలు ప్రపంచ దేశాలు అండగా ఉండి సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, భాస్కర్ నరేష్ అహ్మద్ రసూల్ బాలన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న జి.రామకృష్ణ